క్లుప్తంగా

రామవరం బ్రిడ్జి పరిశీలన



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం – రామవరాన్ని అనుసంధానం చేసే రామవరం గోధుమ వాగు బ్రిడ్జి, పక్కనున్న సర్వీసు రోడ్డును మంగళవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రిడ్జిపైన ఉన్న డివైడర్‌ను, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, సంబంధిత ఆర్‌అండ్‌బీ ఈఈ, డీఈలను ఆదేశించారు. తదుపరి విద్యానగర్, సెయింట్ జోసఫ్ ప్రధాన రహదారులపై నిలుస్తున్న వర్షపు నీరు, డ్రెయినేజీ నీళ్లు ఆగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, ఎంపీటీసీ గోవిందు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంటౌన్: రానున్న బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ ఎం.కరుణాకర్ ఆధ్వర్యంలో మతపెద్దలతో మీటింగ్ ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సందర్భంగా ఎవరైనా గొడవలకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, మేసేజ్‌లు పంపితే కేసులు తప్పవని హెచ్చరించారు. సర్వమత సమ్మేళనంగా అందరూ సంతోషంగా పండుగను ఘనంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దన్నారు.

మెడికల్ కళాశాలలో అవకతవకలపై విచారణ

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం జిల్లాలోని మెడికల్ కళాశాలలో ఇటీవల మంజూరైన అవుట్ సోరింగ్ ఉద్యోగాల భర్తీలో జరిగిన అవకతవకలపై జిల్లా ఉపాధి శాఖ అధికారి విజేత మంగళవారం విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావుతో మాట్లాడి వివరాలు సేకరించారు. నివేదికను కలెక్టర్ ప్రియాంకకు అందజేస్తామని విచారణాధికారి తెలిపారు.

సీఐల నియామకం



బి.సత్యనారాయణ

ఇల్లెందు: ఇల్లెందు సీఐగా బత్తుల సత్యనారాయణ నియామకం అయ్యారు. ఇక్కడి సీఐ టి.కరుణాకర్‌ను మల్టీ జోన్ ఐజీకి రిపోర్ట్ చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారు. బత్తుల సత్యనారాయణ ఇల్లెందు సబ్ డివిజన్ పరిధిలోని టేకులపల్లిలో ఎస్‌ఐగా విధులు నిర్వహించి ఇల్లెందుకు సుపరిచితుడుగా ఉన్నారు. 2004లో ఎస్‌ఐగా నియామకం అయిన ఆయన దుమ్ముగూడెంలో తొలి పోస్టింగ్ పొందారు. అనంతరం పాల్వంచ రూరల్, టేకులపల్లిలో ఎస్‌ఐగా విధులు నిర్వహించి ఇక్కడి నుంచే పదోన్నతి మీద సీఐగా నియామకం అయ్యారు. సీఐగా తొలి పోస్టింగ్ ఏటూరు నాగారంలో పొందిన ఆయన కొత్తగూడెం -2 టౌన్, కొత్తగూడెం -1 టౌన్, ఖమ్మం -3 టౌన్, ఖమ్మం సీసీఎస్, నిజామాబాద్‌లో విధులు నిర్వర్తించి ఇల్లెందు సీఐగా నియామకమయ్యారు.

పాల్వంచ సీఐగా సతీశ్..



పాల్వంచ: పాల్వంచ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సతీశ్ నియామకమయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ వినయ్‌కుమార్ ఐజీకి అటాచ్ అయ్యారు. ఖమ్మం ఎస్‌బీలో పనిచేస్తున్న సీఐ సతీశ్ పాల్వంచకు రానున్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



పనులను పర్యవేక్షిస్తున్న చైర్మన్ డీవీ

ఇల్లెందు: మంగళవారం తెల్లారుజాము నుంచి పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్త చెదారం తొలగించి కాలువను క్లీన్ అండ్ గ్రీన్ పనులు చేపట్టారు. మున్సిపల్ ఆధ్వర్యంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉంచటమే లక్ష్యంగా ఈ డ్రైవ్ సాగుతుందని పనులను పరిశీలించిన చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన వెంట శానిటేషన్ ఇన్‌చార్జ్ సీహెచ్ శ్రీను, జవాన్లు ఆంజాద్, ప్రకాష్ ఉన్నారు.

సర్కారు బడి సమస్యల ఒడి..

- అరకొర తరగతి గదులతో విద్యార్థుల అవస్థలు
- నాగారం, యానంబైల్ హైస్కూళ్లలో వేధిస్తున్న సమస్యలు
- మన ఊరు – మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పూర్తికాని పనులు
- నేటి నుంచి నూతన విద్యాసంవత్సరం



సరిపడా గదులు లేక వరండాలో కూర్చున్న యానంబైల్ పాఠశాల విద్యార్థులు (ఫైల్)

పాల్వంచరూరల్: పాఠశాలలు తెరిచే నాటికి స్కూళ్లల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, మరమ్మతులు పూర్తి చేసి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు స్వాగతం పలకాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేక శిథిలావస్థకు చేరిన భవనంలో తరగతులు నడపడంతో విద్యార్థులు నేలపై కూర్చుని అవస్థలు పడుతున్న పరిస్థితి నాగారం హైస్కూల్, యానంబైల్‌లోని పాఠశాలల్లో నెలకొంది. పాల్వంచ మండలంలో మొత్తం 49 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 17 ప్రాథమికోన్నత పాఠశాలలు, నాలుగు హైస్కూల్స్ ఉండగా మొత్తం 384 మంది ఉపాధ్యాయులకుగాను 336 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 48 ఉపాధ్యాయల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

తప్పని ఇబ్బందులు...

నాగారం గ్రామంలోని హైస్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఆయా తరగతిల్లో 167 మంది విద్యార్థులు ఉన్నారు. ఏడు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. అందులో ఒక భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో వర్షం వస్తే కురుస్తుంది. స్లాబ్ పెచ్చులు ఊడి కిందపడుతున్న పరిస్థితి ఉంది. ల్యాబ్, లైబ్రరీకి గదులు లేదు. కంప్యూటర్ గది కూడా పూర్తిగా శిథిలమై వర్షాకాలంలో కురుస్తుంది. గదిలో ఉన్న పది కంప్యూటర్లు తడిసి ఉపయోగంలో లేకుండా పోయాయి. విద్యార్థులు చదువులో రాణిస్తున్నప్పటికీ స్కూల్‌కు క్రీడా మైదానం లేకపోవడంతో స్థానికులంతా కలిసి కొనుగోలు చేశారు. అయితే దానిని అందుబాటులోకి తీసుకరావడం లేదు. దీంతో మైదానం చెట్లు, రాళ్లతో నిండి ఉంది. దానిని బాగు చేయాలంటే నిధులు లేక విద్యార్థులు క్రీడల్లో వెనకబడిపోయారు.

మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక అవస్థలు..

హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో నాలుగు తరగతి గదులు అవసరం ఉన్నాయి. తరగతి గదులు లేక పోగా మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేకపోవడంతో విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. దీంతో విద్యార్థులు ఇళ్లకు కొందరు, బయటకు కొంతమంది వెళ్తున్నారు. విద్యార్థినులు 75 మంది ఉంటే సరిపడా టాయిలెట్లు లేవు. మన ఊరు – మన బడి కింద మూడు నెలల క్రితం రూ.27లక్షలు మంజూరయ్యాయి. కానీ ఇంత వరకు పనులు పూర్తికాలేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

యానంబైల్ పాఠశాలలో తరగతి గదుల కొరత..

యానంబైల్ గ్రామంలోని హైస్కూల్‌లో 2022లో మన ఊరు – మన బడి కింద గత ప్రభుత్వం రూ.5.94లక్షలు మంజూరు చేసింది. ప్రహరీ, డైనింగ్ హాల్, మైనర్, మేజర్ మరమ్మతులు నిర్వహించాల్సి ఉండగా కేవలం విద్యుత్‌కు సంబంధించి మరమ్మతులు మాత్రమే పూర్తిచేశారు. మిగిలిన పనులు సగంలో నిలిపివేశారు. పనుల కోసం పాఠశాల ప్రాంగణంలో గోతులు తీసి వదిలేశారు. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లాలంటే ఇబ్బందికర పరిస్థితి. ఇదిలా ఉండగా ఇంగ్లిష్ మీడియంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు ఉండగా స్కూల్ భవనం శిథిలావస్థకు చేరింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేక విద్యార్థులు నేలపై కూర్చుంటున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులకు గాను ఇద్దరు మాత్రమే ఉన్నారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు, సరైన క్రీడామైదానం కూడా లేదు. మందేరకలపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 32మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు



శిథిలావస్థలో నాగారం హైస్కూల్

టీచర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ మరో టీచర్‌ను నియమించాలి. రాజాపురంలో 1నుంచి 5వ తరగతి వరకు ఇద్దరు టీచర్లకు గాను ఒక్కరు మాత్రమే ఉన్నారు. రూ.2.50లక్షల వ్యయంతో నిర్మించిన మూత్రశాలలకు నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్నాయి.

అసంపూర్తిగా అభివృద్ధి పనులు..

మండలంలో మనఊరు – మన బడి కింద గతేడాది మండలంలో ఎనిమిది స్కూళ్లకు రూ.9.91లక్షలు మంజూరు కాగా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.1.14కోట్లు వచ్చాయి. అయినా నాగారం, యానంబైల్, తొగ్గూడెంలో పాఠశాలలో పూర్తికాలేదు. ఈ ఏడాది అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా 34 స్కూళ్లలో మరమ్మతుల కోసం రూ.45లక్షలు కేటాయించారు. ఈ పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి.

హైస్కూల్‌లో సౌకర్యాలు కల్పించాలి



యానంబైల్ హైస్కూల్‌లో పనులు నత్తనడక నడుస్తున్నాయి. గుంతల మీదుగా విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు కానీ క్రీడామైదానం కానీ లేక ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారు.– బుడగం మోహన్‌రావు, యానంబైల్

34 స్కూళ్లకు నిధులు మంజూరు



మన ఊరు – మన బడి కింద గతేడాది నాగారం హైస్కూల్‌కు రూ.27లక్షలు, యానంబైల్ స్కూల్‌కు రూ.5.94లక్షలు మంజూరయ్యాయి. వాటితో పాటు అమ్మ అదర్శ కమిటీల ద్వారా 34స్కూళ్లకు రూ.45లక్షలు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి. – శ్రీరామ్మూర్తి, ఎంఈఓ

తాగునీటి సమస్యను పరిష్కరించండి..



ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్సీ బస్తీ రాజీవ్ నగర్ తండా సమీపంలో గుడిసెవాసులకు తక్షణం తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. ఐదేళ్లుగా తాగునీటి సౌకర్యం కల్పించాలని పలు రూపాల్లో ఆందోళనలు చేసి అధికారులకు వివరించినా పరిష్కరించడం లేదని ఆరోపించారు. మండల పరిషత్ సమావేశాలలో ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. తాగునీటి సౌకర్యంతోపాటు విద్యుత్, రహదారులు, మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మన్యం మోహన్, ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, రాందాస్, హుస్సేన్, వెంకన్న, వీరస్వామి, సుజాత, కౌసల్య, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

14న ఐఎఫ్‌టీయూ ఏరియా మహాసభ

టేకులపల్లి: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) టేకులపల్లి ఏరియా మహాసభ ఈనెల 14న టేకులపల్లిలో జరుగుతుందని ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు జరుపుల సుందర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. టేకులపల్లి ప్రాంతంలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం నిరంతరంగా పోరాడుతుందన్నారు. కార్మికుల వేతనాలు, సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై జరిగిన పోరాటంలో ఐఎఫ్‌టీయూ ముందు భాగాన నిలిచిందన్నారు. సింగరేణి, హమాలీ, ఆటో, మోటార్ వర్కర్లు, గ్రామపంచాయతీ, మధ్యాహ్న భోజనం, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ తదితర రంగాల కార్మికుల తరఫున నిరంతరం పోరాడుతూ ముందుకు సాగుతున్నామన్నారు. ఈ



మాట్లాడుతున్న సుందర్

క్రమంలోనే టేకులపల్లి ఏరియా 4వ మహాసభను మరింత బలోపేతం చేయడం కోసం టేకులపల్లి ఏరియా నిర్మాణ మహాసభను జరుపుకుంటున్నామని మహాసభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ధనసరి భద్రం, కల్తీ వీరస్వామి, సైదులు, అన్వేష్, ప్రశాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాధక్క త్యాగం మరువలేనిది



ఇల్లెందు: రాధక్కకు నివాళులర్పిస్తున్న ఎన్డీ నాయకులు

ఇల్లెందు: సీపీఐ(ఎంఎల్) గోదావరి లోయ ప్రతిఘటన ఉద్యమ నిర్మాత చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరి రాధక్క(86) త్యాగం మరువలేనిదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర ప్రధాన కార్యదర్శి చంద్రన్న, రాష్ట్ర కార్యదర్శి అశోక్‌లు తెలిపారు. మంగళవారం రాధక్క మృతి చెందిన సమాచారం అందుకున్న వారు ఆమెకు నివాళులర్పించారు. 60 ఏళ్ల పాటు సీపీఐ(ఎంఎల్) బలోపేతం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని తెలిపారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ గోదావరి లోయలో పార్టీ విస్తరణ కోసం పాటుపడిన రాధక్క మరణం తీరని లోటన్నారు. ఇదిలా ఉండగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సాధినేని వర్గం రాష్ట్ర నాయకుడు జే.సీతారామయ్య రాధక్క చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్డీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మధు, మాస్‌లైన్ నాయకులు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యలు వేర్వేరు ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

టేకులపల్లి: సీపీఐ(ఎంఎల్) ప్రతిఘటన ఉద్యమ నాయకురాలు రాధక్క అలియాస్ నిర్మలక్క (86) మంగళవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆమె మృతికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రెండు పార్టీల నాయకులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు.

రాధక్క ఆరు దశాబ్దాలకు పైగా విప్లవోద్యమంలో చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలో వివిధ బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో ఆమె ప్రముఖ పాత్ర వహించారని, ప్రజా ఉద్యమంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.

రేపు హుండీ లెక్కింపు

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం 13వ తేదీ గురువారం ఉదయం 9గంటల నుంచి హుండీ కానుకలను లెక్కింపు జరపనున్నట్లు ఈఓ జి.సుదర్శన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 14 నుంచి ఈనెల 12వ తేది వరకు భక్తులు మొక్కులు సమర్పించిన హుండీ కానుకలను లెక్కింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



అనసూర్యమ్మ (ఫైల్)

జూలూరుపాడు: జూలూరుపాడుకు చెందిన శతాధిక వృద్ధురాలు అనసూర్యమ్మ (105) మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు ఆమె మృతదేహం వద్ద వివిధ పార్టీలు, సంఘాల నాయకులు నివాళులర్పించి ఆమె కుమారుడు, కాంగ్రెస్ నాయకుడు యల్లంకి పుల్లయ్యను పరామర్శించారు. సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్ రావు, నాయకులు సున్నా రంగారావు, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, మాచినేని సత్యనారాయణ మాదినేని సతీష్ పాల్గొన్నారు.

నేడు పాఠశాలలు పునఃప్రారంభం

జూలూరుపాడు: ఈ ఏడాది విద్యా సంవత్సరం బుధవారం నుంచి పునఃప్రారంభం కానుండడంతో పాఠశాలల్లో బడి గంట మోగనున్నది. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ వరకు విద్యార్థులకు వేసవి సెలవులు రావడంతో ఆటపాటలతో గడిపారు. తిరిగి ఆటలకు సెలవు చెప్పి విద్యా బుద్ధులు నేర్చుకునేందుకు బడిబాట పట్టనున్నారు. మండలంలో ప్రాథమిక పాఠశాలలు 37, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, గిరిజన ప్రాథమిక పాఠశాలలు 6, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 5, కస్తూర్బా బాలికా విద్యాలయం, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలతోపాటు మొత్తం 55 పాఠశాలలు ఉన్నాయి. గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 3,053 విద్యార్థులు విద్యనభ్యసించారు. పాఠశాలల పునఃప్రారంభాన్ని ఘనంగా ప్రారంభించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు, అమ్మ-ఆదర్శ పాఠశాల కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి.



జూలూరుపాడు హైస్కూల్

తాగునీటి కోసం ప్రజల ఇక్కట్లు

జూలూరుపాడు: భేతాళపాడు గ్రామ పంచాయతీ టాక్యాతండా గ్రామంలో తాగునీటి సమస్య తక్షణమే పరిష్కరించాలని గిరిజన సంఘం నాయకుడు బానోత్ మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో సమస్య తలెత్తడంతో పది రోజులుగా తండా ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. సమస్యను మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

‘మధ్యాహ్న’ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న వంట కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కనీసం రూ.10వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. నిత్యావసర వస్తువులు, గుడ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అల్పాహారం, స్నాక్స్, వండిన పనికి పారితోషికం అందించాలని కోరారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, యూనిఫాం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి విజయలక్ష్మి, మంగ, ప్రభావతి, ముత్యాలు, రమణ, అరుణ, పద్మ, క్రాంతి, సరళ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలిప్పించండి..

ఇల్లెందురూరల్: మామిడిగుండాల రెవెన్యూ పరిధిలో సీలింగ్ భూములకు పట్టాలిప్పించాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు గ్రామ రైతులు తెలిపారు. సీలింగ్ భూములకు సంబంధించి 2022లో అప్పటి జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో సీలింగ్ భూముల సమగ్ర సర్వే చేపట్టారని గుర్తుచేశారు. సర్వే పూర్తి చేసి రిపోర్టును రెవెన్యూ అధికారులకు అందజేశారని చెప్పారు. నాటి రిపోర్ట్ ఆధారంగా సాగులో ఉన్న రైతులందరికీ రెవెన్యూ పట్టాలు ఇప్పించాలని కోరినట్లు రైతులు మూతి కృష్ణ, నారాయణ, కల్తి వీరస్వామి, తోలెం సురేష్, భూపతి, బాదావత్ హుస్సేన్ తదితరులు తెలిపారు.

పాల్వంచరూరల్: పాల్వంచలోని భూవివాదాలను పరిష్కరించాలని కోరుతూ డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. 444, 999, 817, 727 సర్వే నంబర్‌లో భూముల రిజిస్ట్రేషన్ లేక 2016 నుంచి క్రయవిక్రయాలు నిలిచిపోయాయని, కలెక్టర్, ఎమ్మెల్యేతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు.



మాట్లాడుతున్న మామిడిగుండాల రైతులు

డిపెండెంట్లకు న్యాయం జరిగింది..



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

టేకులపల్లి: ఏఐటీయూసీ కృషి ఫలితంగా సింగరేణిలో డిపెండెంట్లకు న్యాయం జరిగిందని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మంగళవారం కేటీసీలో జరిగిన ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ... సింగరేణిలో గతంలో డిపెండెంట్ ఉద్యోగాలకు వయస్సు 35 సంవత్సరాలు ఉండేదని, దీనిని 40 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ మూడు నెలల క్రితమే గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. గతంలోనే ఈ డిమాండ్ను యాజమాన్యం ఒప్పుకోవడం జరిగిందని, ఎన్నికల కోడ్ వలన ఆలస్యం జరిగిందని చెప్పారు. డిపెండెంట్లకు 35 నుంచి 40 సంవత్సరాలకు వయస్సు పెంపును అమలు చేసేందుకు యాజమాన్యం సోమవారం సర్క్యులర్ జారీ చేసిందని పేర్కొన్నారు. హర్షం వ్యక్తం చేస్తూ సింగరేణి యామాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్మిక సోదరులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కృషిని గుర్తించాలన్నారు. వయస్సు పెంపుదల విషయంలో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోత్ కృష్ణ, ఫిట్ సహాయ కార్యదర్శులు బాలాజీ, షెక్ సర్వర్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ జీఏ శ్రీనివాస్, సామల శ్రీనివాస్, వెంకటనర్సయ్య, వి.రవి, రామకృష్ణ చారి పాల్గొన్నారు.

వానాకాలం సాగు ముమ్మరం

- పత్తి సాగుపైనే రైతుల ఆసక్తి
- విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

టేకులపల్లి: మృగశిరకార్తె మొదలవడంతో వానాకాలం వ్యవసాయ పనులు ముమ్మరం అయ్యాయి. పనిముట్లకు పూజలు చేసిన రైతులు ఇప్పటికే పత్తి విత్తనాలు నాటడంతో పలు చోట్ల మొలకలు కూడా వచ్చాయి. గతం కంటే ఈసారి మెరుగైన దిగుబడి వస్తుందనే గంపెడాశతో టేకులపల్లి మండలంలోని రైతులు సాగు పనులు ప్రారంభించారు. చేలల్లో చెత్త ఏరివేయడం, దుక్కులు దున్నడం, విత్తనాలు విత్తడం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈసారి ముందుగానే నైరుతి రుతుపవనాలు పలకరించడంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే ఆశాభావంలో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో లీనమయ్యారు.

పత్తి పంటపైనే ఆసక్తి...

గత సీజన్ మాదిరిగానే ఈ సీజన్‌లోనూ మండల రైతులు పత్తి సాగుపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. గత సీజన్‌లో వరి, మొక్కజొన్న, కందులు, పెసర్లు, బొబ్బర్లు, మిర్చి, పత్తి, కూరగాయలు, ఆయిల్‌పామ్ మొత్తం కలిపి 55,667 ఎకరాల్లో సాగు చేశారు. ఈ వానాకాలంలో వరి 5,500, మొక్కజొన్న 10,000, పెసర 200, కందులు 2,500, మినుములు 10, మిర్చి 6,000, పత్తి 32,000, కూరగాయలు 200, ఆయిల్‌పామ్ 500 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారుల లెక్కల చెబుతున్నాయి. గతం కంటే వరి, మిర్చి పంటల సాగు ఈసారి తగ్గగా, మొక్కజొన్న, పెసర, కందులు, మినుములు, పత్తి, కూరగాయలు, ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెరిగింది.

భారంగా మారిన పెట్టుబడులు..

గత సీజన్‌తో పోలిస్తే ఈ సీజన్‌లో రైతులకు పెట్టుబడులు భారంగా మారాయి. పెరిగిన డీజిల్ ధరలు, కూలీల కొరత తదితర కారణాలతో రైతులు సతమతం అవుతున్నారు. రెండు విత్తన బ్యాగులకు రూ.1700, నలుగురు కూలీలకు రూ.1000, పత్తి కట్టె తొలగింపు, చదును చేయడానికి ఎకరానికి రూ.1600, మిరప కట్టె తొలగించడానికి, చదునుకు రూ.1800, ట్రాక్టర్‌తో ఎకరా నాగలితో దుక్కికి రూ.2800, గొర్రుకు రూ.1600, అరకతో అచ్చుకు రూ.1400 ఇలా మొత్తం రూ.10 నుంచి రూ.12 వేల వరకు రైతులకు ఖర్చు భారమవుతోంది.




తొమ్మిదోమైలు తండాలో దుక్కి దున్నుతున్న రైతు



గోలియా తండాలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

విత్తనాలు సరిపడా ఉన్నాయి..



టేకులపల్లి మండలంలో వానాకాలం సాగుకు సంబంధించి సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వర్షాలను దృష్టిలో ఉంచుకుని అదును చూసి విత్తుకుంటేనే ఫలితం ఉంటుంది. గుర్తింపు పొందిన లైసెన్స్ దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. తప్పనిసరిగా రశీదులు తీసుకుని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలి. – నీరుడు అన్నపూర్ణ, ఏఓ, టేకులపల్లి